తొలి సమయం

దిన పత్రిక

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 129 సోమవారం 12-05-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 7 వెల : 5 రూ/..

నేడు హాట్‌లైన్‌లో

భారత్-పాక్ డీజీఎంవోల చర్చలు

ప్రస్తావనకు రానున్న కాల్పుల విరమణ కొనసాగింపు, ఇతర కీలకాంశాలు

న్యూఢిల్లీ, మే 11: భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ కుదిరిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)లు పాల్గొననున్నారు. కాల్పుల విరమణ కొనసాగింపు, సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితుల వంటి కీలకాంశాలపై చర్చించనున్నారు. అయితే శనివారం మధ్యాహ్నమే ముందుగా భారత్ డీజీఎంవోతో పాక్ డీజీఎంవో హాట్‌లైన్‌లో మాట్లాడారు. కాల్పుల విరమణ అంశాన్ని ప్రతిపాదిస్తూ తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలోనే శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. ఇది జరిగిన కొన్ని గంటల్లోపే డ్రోన్ దాడులు, కాల్పులకు తెగబడి పాక్ సైన్యం విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన సంగతి తెలిసిందే. కాగా, భారత సైన్యానికి సంబంధించిన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేస్తున్న ఇద్దరు వ్యక్తులను పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు.

పీవోకేను తిరిగి ఇవ్వాల్సిందే..

మాకు ఎలాంటి మధ్యవర్తిత్వం అక్కర్లేదు

అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్‌కు మోదీ స్పష్టం

న్యూఢిల్లీ, మే 11: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను భారత్‌కు తిరిగి ఇవ్వాల్సిందేనని.. చర్చలకు ఇదే ప్రధానమని ప్రధాని మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు తేల్చిచెప్పినట్లు తెలిసింది. పాకిస్థాన్ తమకు ఉగ్రవాదులను అప్పగించాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ మేరకు శనివారం ఉదయం జేడీ వాన్స్, మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వివరాలతో సీఎన్ఎన్, ఇండియాటుడే టీవీ కథనాలను ప్రచురించాయి. "పీవోకేను తిరిగి తీసుకోవడం మా ప్రాథమ్యం. కశ్మీర్‌పై మాకు స్పష్టత ఉంది. ఈ విషయంలో మాకు ఎలాంటి మధ్యవర్తిత్వం అవసరం లేదు" అని వ్యాఖ్యానించినట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే.. మోదీకి జేడీ వాన్స్ ఫోన్ చేయడానికి బలమైన కారణాలున్నట్లు సీఎన్ఎన్ మరో కథనంలో తెలిపింది. "శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారత్-పాక్‌ల మధ్య పోరు తీవ్రమైంది" అంటూ అత్యంత కీలకమైన హెచ్చరికలను ఇంటెలిజెన్స్ వర్గాలు వైట్‌హౌసకు అందజేసినట్లు పేర్కొంది. అయితే.. ఇంటెలిజెన్స్ హెచ్చరికల్లోని ముఖ్యాంశాలను మాత్రం ఆ వర్గాలు వెల్లడించలేదని వివరించింది. ఆ వెంటనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్, జాతీయ భద్రత సలహాదారు, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్ భారత్-పాక్ ఉద్రిక్తతలను తక్షణం నిలువరించాల్సిన అవసరం ఉందని భావించినట్లు వెల్లడించింది. ఆ మేరకు వైట్‌హౌస్ తీసుకున్న నిర్ణయంతో వాన్స్ వెంటనే(శనివారం ఉదయం) ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసినట్లు స్పష్టం చేసింది. వాన్స్ పర్యటన సందర్భంలోనే పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే..! వాన్స్‌తో ఫోన్ సంభాషణలో భాగంగా ప్రధాని మోదీ.. పీవోకే, ఉగ్రవాదుల అప్పగింతపై ప్రపంచం.. ప్రత్యేకించి పాకిస్థాన్ అంగీకరించాలని అన్నట్లు సీఎన్ఎన్, ఇండియాటుడే కథనాలు తెలిపాయి. ఒకవేళ పాక్ మళ్లీ కాల్పులు జరిపితే.. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని తేల్చిచెప్పినట్లు వివరించాయి. భారత్-పాక్ మధ్య చర్చలు ప్రధాని స్థాయిలోనో.. జాతీయ భద్రత సలహాదారుల స్థాయిలోనో జరగవని, మిలటరీ ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్స్(డీజీఎంవో) స్థాయిలో చోటుచేసుకుంటాయని వివరించినట్లు తెలిపాయి. భారత్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ప్రకటన రాగానే.. ఉన్నఫళంగా తీసుకున్న ఈ నిర్ణయంపై మోదీ సర్కారుపై వ్యతిరేకత వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ కథనాలు ప్రచురితమవ్వడం గమనార్హం..!

స్వదేశీ సాంకేతికత

అభివృద్ధే లక్ష్యం

రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం కృషి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మే 11: స్వదేశీ సాంకేతికత ఆధారంగా ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించేందుకు కొత్త ఆవిష్కరణల దిశగా కృషి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా భారతదేశానికి అసాధారణమైన సాంకేతికతను అందించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోఖ్రాన్ అణు పరీక్షల వెనక ఉన్న శ్రమను కొనియాడారు. ఇది మన దేశ శాస్త్రీయ సామర్థ్యాన్ని, సంకల్పాన్ని చాటిన అసాధారణ ఘట్టమని కిషన్‌రెడ్డి ప్రశంసించారు. తెలంగాణ అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి రహదారుల విస్తరణ చేపట్టిందని తెలిపారు. 2014 నుంచి రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి కోసం రూ. 31,000 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఈ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా 2,722 కి.మీ. జాతీయ రహదారుల నిర్మాణం, మరో 2,526 కి.మీ. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ఉన్నతీకరణ చేశామని వెల్లడించారు. భవిష్యత్‌లో భారతమాల పరియోజన మొదటి దశలో రూ. 38,297 కోట్ల భారీ బడ్జెట్‌తో రాష్ట్ర వ్యాప్తంగా మరో 1,719 కి.మీ. జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తామని కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.

నేడు బుద్ధవనానికి అందాల భామలు

నాగార్జునసాగర్‌కు మిస్‌వరల్డ్ ప్రతినిధుల రాక..

ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్లనున్న అధికారులు... 2 వేల మంది పోలీసులతో బందోబస్తు

హైదరాబాద్/నాగార్జునసాగర్, మే 11: మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొంటున్న వివిధ దేశాల సుందరీమణులు సోమవారం బుద్ధపూర్ణిమను పురస్కరించుకొని నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 110 దేశాలకు చెందిన అందగత్తెలు మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొంటుండగా.. ఆసియా దేశాల నుంచి వచ్చినవారు మాత్రం బుద్ధవనం సందర్శనకు వెళ్లనున్నారు. బౌద్ధమతంపై విశ్వాసం, బుద్ధుని చరిత్ర తెలుసుకోవాలనే ఆసక్తి గల 30 దేశాలకు చెందిన మిస్‌వరల్డ్ పోటీదారులు బౌద్ధ థీమ్‌పార్క్‌లోని స్తూపంలో బుద్ధుని విగ్రహాల చెంత జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రత్యేకించి ఆయా దేశాల ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించనున్నారు. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి భారీ బందోబస్తు మధ్య పర్యాటక అభివృద్ధిసంస్థ ప్రత్యేక బస్సులో వీరిటి నాగార్జునసాగర్‌కు తీసుకువెళ్లనున్నారు. మధ్యలో నల్లగొండ జిల్లా చింతపల్లి సమీపంలోని అతిథిగృహం వద్ద కొంతసేపు ఆగుతారు. అక్కడ పర్యాటక సంస్థ విజయ్‌విహార్‌లో కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఫొటో సెషన్ తర్వాత అక్కడినుంచి నేరుగా బుద్ధవనం చేరుకుంటారు. లంబాడా కళాకారులు మిస్‌వరల్డ్ ప్రతినిధులకు సంప్రదాయ నృత్యంతో స్వాగతం పలుకుతారు.

ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేల..

బుద్ధుని ప్రియశిష్యుడు ఆచార్య నాగార్జునుడు నడయాడిన కృష్ణా నదీతీరం నాగార్జునసాగర్ జలాల సమీపంలో 274 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బుద్ధవనం, బౌద్ధ థీమ్ పార్క్‌ను అభివృద్ధి చేశాయి. ఇక్కడ బుద్ధుని జీవితం, బోధనలు, బౌద్ధకళ, సంస్కృతిని ప్రదర్శించే పలు నిర్మాణాలు పూర్తి చేశారు. మిస్‌వరల్డ్ పోటీదారులు ఇక్కడ ధ్యానం చేసిన తర్వాత 25 మంది బౌద్ధ సన్యాసులు బైలికుప్ప మహాబోధి పూజలు నిర్వహిస్తారు. పురావస్తు నిపుణుడు శివనాగిరెడ్డి బుద్ధవనం ప్రాజెక్టు ప్రాముఖ్యత, ప్రాశస్త్యంను వివరిస్తారు. అందాల భామల రాక నేపథ్యంలో పర్యాటక శాఖ అధికారులు బుద్ధవనాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. మహాస్థూపం, బుద్ధ పాదాలవద్ద లేజర్ లైట్లు, జాతక వనం లో ఓపెన్ థియేటర్ ఏర్పాటు చేశారు. స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఐదు పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. కాగా, మిస్ వరల్డ్ పోటీదారుల రాక సందర్భంగా 2వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు.

మధ్యవర్తిత్వం చేస్తా..

కశ్మీర్‌పై ట్రంప్ అత్యుత్సాహం

ఆఫర్‌ను తోసిపుచ్చిన భారత్..

పీవోకేను అప్పగించడంపైనే మాట్లాడతామని స్పష్టీకరణ

ట్రంప్ ఆఫర్‌ను స్వాగతించిన పాక్

న్యూఢిల్లీ, మే11: ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాన్ని ఆపలేకపోయారు.. ఇజ్రాయెల్-హమాస్ మధ్య శాంతిని నెలకొల్పడంలోనూ విఫలమయ్యారు.. కానీ భారత్-పాక్ మధ్య పెద్దన్న పాత్ర పోషించి కశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సిద్ధమైపో యారు. అయితే ట్రంప్ ఆఫర్‌ను భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాత్రం ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని స్వాగతించ డంతో పాటు ఈ విషయంలో చొరవ చూపుతున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణలో అమెరికా పాత్ర ఉందని ప్రకటించుకున్న ట్రంప్.. కశ్మీర్ అంశంపైనా అత్యుత్సాహం ప్రదర్శిం చారు. ఈ సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ విషయమె భారత్, పాక్‌తో కలిసి పని చేస్తామని తన ట్రూత్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో శనివారం పోస్టు చేశారు. 'ప్రస్తుత సంఘర్షణలతో మరణాలు, విధ్వంసం తప్ప ఏ ప్రయోజనం ఉండదని భారత్, పాక్‌లోని బలమైన, శక్తిమంతమైన నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉంది. కాల్పుల విరమణపై నిర్ణయం తీసుకో వడంలో అమెరికా మీకు సాయం చేయగలిగినందుకు గర్విస్తున్నాను. కశ్మీర్ సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవడంలో మీతో కలిసి పనిచేస్తా' అని ఆ పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు. కాగా, రెండు దేశాల మధ్య శాంతిని నెలకొల్ప డానికి అమెరికా చేస్తున్న ప్రయత్నా లను పాక్ ప్రధాని ప్రశంసించారు. అయితే కాల్పుల విరమణకు పాక్ డీజీఎంవో ప్రతిపాదన చేశారని, ఇందులో మరొకరి పాత్రలేదని భారత్ పేర్కొంది. కశ్మీర్ విషయంలో ఎవరి మధ్యవర్తిత్వం అవసరంలేదని స్పష్టంచేసింది. 'కశ్మీర్ విషయంలో మాకు స్పష్టమైన వైఖరి ఉంది. పీవోకేను తిరిగి అప్పగించడం ఒక్కటే మిగిలి ఉంది. ఈ విషయంలో ఇంతకుమించి మాట్లాడటానికి ఏంలేదు. ఉగ్రవాదుల అప్పగింతపై వాళ్లు మాట్లాడితే... మేం మాట్లాడతాం. మరో విషయంపై మాట్లాడే ఉద్దేశం లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వం కోరుకోవడంలేదు. ఆ అవసరమూ లేదు'అని ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి.

బీజేపీ బీసీలకు వ్యతిరేకం: పొన్నం

హైదరాబాద్, మే 11: బీసీలకు బీజేపీ ఎప్పుడూ అన్యాయమే చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఆ పార్టీలో అధికార పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించని బీజేపీ.. గతంలో కులగణనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించిందన్నారు. బీసీల విషయంలో కాంగ్రెసపై బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, సంస్థలు, మేధావులు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను ప్రశంసిస్తుండగా బీజేపీ నాయకులు మాత్రం కాళ్లల్లో కట్టె పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

నేటి నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్

ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్

వచ్చే నెలాఖరుకు రాష్ట్ర వ్యాప్తంగా అమలు

అధిక రద్దీ కార్యాలయాల్లో అదనపు సిబ్బంది నియామకం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్, మే11: రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించిన స్లాట్ బుకింగ్ విధానం సోమవారం(12వ తేదీ) నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలులోకి రానుంది. అలాగే, జూన్ నెలాఖరు కల్లా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం ఓ ప్రకటన చేశారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని తొలుత 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించామని, దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. రద్దీ, పని ఒత్తిడి అధికంగా ఉన్న కార్యాలయాల్లో అదనపు సబ్ రిజిస్ట్రార్‌లను నియమిస్తున్నామని చెప్పారు. కుత్బుల్లాపూర్‌లో ఇద్దరు అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమించామని తెలిపారు. ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా స్లాట్ బుకింగ్ అమలు చేయనున్నామని వివరించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో ఉంచుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని పునర్‌వ్యవస్థీకరిస్తున్నామని, అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న కార్యాలయాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ క్రమంలోనే రంగారెడ్డి జిల్లా చంపాపేట, సరూర్‌నగర్ పరిధిని విలీనం చేశామని, షాద్‌నగర్, ఫరూక్‌నగర్ కలిపామని, సిద్దిపేట, సిద్దిపేట రూరల్ సబ్ రిజిస్ట్రార్‌లను విలీనం చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు.

బాధపడొద్దు.. బాధ్యత తీసుకుంటా...

గల్ఫ్ బాధిత కుటుంబానికి కేటీఆర్ భరోసా

సిరిసిల్ల/హైదరాబాద్, మే 11: సౌదీ అరేబియాలో 15 రోజుల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన మంద మహేశ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. విష యం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండేపల్లిలో ఉన్న మహేశ్ కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. సొంత ఖర్చులతో మహేశ్‌ను భారత్‌కు తీసుకొచ్చి అన్ని విధాలుగానూ ఆదుకుంటానని బాధపడొద్దని భరోసా ఇచ్చారు. మహేశ్‌తో ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కాగా, ఈ విశ్వంలో అత్యంత గొప్ప ప్రేమను పంచేది తల్లి మాత్రమేనని.. ఎంతో గొప్పవారిని మనకు అందించిన మాతృమూర్తులకు వందనం అంటూ కేటీఆర్ ఆదివారం మదర్స్ డే సందర్భంగా ఎక్స్ వేదికగా.. అమ్మలను అభినందించారు.

అమ్మ ..ఓ గొప్ప స్నేహితురాలు
ఆ పదంలో ఆప్యాయత, అమ్మకు ప్రేమతో...

తొలి సమయం తొర్రూరు మే 11



అమ్మ అనగా ఆత్మీయత, ఆదర్శం, కమ్మదనం, తీయదనం ఇంకా ఎన్నెన్నో... ఎంత చెప్పినా తక్కువే.. మాటలకు అందనిది అమ్మ ప్రేమ. కడుపులో నలుసు పడిన నాటి నుంచి నవ మాసాలు ఎన్నో సంఘటనలు ఎదుర్కొని తన రక్త మాంసాలు పంచి అమ్మ పునర్జన్మనెత్తుతూ బిడ్డకు జన్మనిస్తుంది. పొత్తిళ్లలో పసికందును చూసి ప్రసవవేదనను మరిచిపోతుంది. 'అమ్మంటే తెలుసుకో, జన్మంతా కొలుచుకో' అని ఒకరు, 'ఎవరు రాయగలరూ అమ్మా అను మాట కన్న కమ్మని కావ్యం.. ఎవరు పాడగలరూ అమ్మా అనురాగం తీయని రాగం'అంటూ మరొకరు అమ్మ గొప్పదనాన్ని తన పాట ద్వారా వ్యక్తం చేశారు. అమ్మను మించి దైవం ఉందా? అవును మరి అవతారమూర్తి కూడా అమ్మకు కొడుకే కదా.అమృతం ఎలా ఉంటుందో తెలియదు గాని అమ్మ ప్రేమ ముందు అది దిగదుడుపే. ఆమె ప్రేమ ఈ ప్రపంచాన్నే మరిపింపజేస్తుంది. ఆ పదానికి అంతటి మహత్మ్యం ఉంది. అంతేకాదు దేవుడు అన్ని చోట్ల తాను ఉండలేక, అమ్మను సృష్టించాడంటారు. ఈ విషయం తెలుసుకోని మనం జన్మనిచ్చి, ఇంతటి వారిని చేసిన దేవతను కళ్ల ముందు ఉంచుకుని, కనిపించని ఆ దేవుడు కోసం గుళ్లు, గోపురాల చుట్టూ తిరుగుతాం.

బిడ్డకు బాధ కలిగిందన్న విషయం మన కంటే ముందు అమ్మకే తెలుస్తుంది. ఆకలి అవుతుందన్న విషయం మనకంటే ముందే అమ్మే పసిగడతుంది. తన బిడ్డ విజయాలు సాధించినప్పుడు అమ్మ ఆనంద పరవశు రాలవుతుంది..

మనకు ఏమాత్రం ఒంట్లో నలతగా ఉందంటే చాలు విలవిల్లాడిపోతూ, నిమిషానికోసారి బుగ్గల మీద, పొట్టమీద చెయ్యి పెట్టి చూస్తూ అమ్మో బిడ్డ వళ్లు కాలిపోతుందంటూ అంత మాత్రానికే ప్రార్థించని దేవుడుండ

అమ్మ గురించి ఎంత చెప్పినా ఇంకా మిగిలిపోతూనే ఉంటుంది ఆమె ప్రేమలా. ఎప్పుడూ మన గురించే ఆలోచన, మనమీదే ధ్యాస. అందుకే అమ్మ ఓ గొప్ప స్నేహితురాలు

అమ్మను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం

అడవి పంది దాడి

- ఇద్దరికీ తీవ్ర గాయాలు - అటవిని కాపాడుదాం - జంతువులను రక్షిద్దాం - అటవీ శాఖ అధికారి వజహాత్

తొలిసమయం కొత్తగూడ మే 11

అడవిపంది దాడిచేసి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని చోటు చేసుకుంది ఆదివారం ప్రత్యేక సాక్షుల కథనం ప్రకారం కొత్తగూడ నుండి నర్సంపేట వెళ్లే దారిలో గువ్వలబోడు సమీపంలో ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న వ్యక్తి పై మరియు ఆటోలో ప్రయాణిస్తున్న జాటోత్ లక్ష్మి (40) లపై అడవిపంది దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సహాయంతో నర్సంపేటలోని ఏరియా హాస్పిటల్ కు తరలించారు.ఘటన స్థలంలో అడవి పంది మృతి.

అటవిని కాపాడుదాం -జంతువులను రక్షిద్దాం

అటవీ శాఖ అధికారి వజహాత్

సమాచారం తెలుసుకున్న కొత్తగూడ మండల అటవీశాఖ అధికారి వజహాత్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి అడవి పందికి పంచనమ నిర్వహించి అనంతరం జంతు దహన నియమాల ప్రకారం జంతువును అక్కడే ఖననం చేశారు.ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి వజహాత్ మాట్లాడుతూ...అడవి జంతువులు రోడ్లపైకి వస్తున్నాయని అటవీ శాఖ హెచ్చరిస్తున్నది. వాహనదారులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో అడవి జంతువులు రోడ్లపైకి వచ్చే అవకాశం ఉంది కనుక అటవీ ప్రాంతాల్లో మరియు వన్యప్రాణుల అభయారణ్యాల గుండా వెళ్లేటప్పుడు వాహన వేగాన్ని తగ్గించి జాగ్రత్త లు తీసుకోవాలని అడవిని కాపాడుదాం – జంతువులను రక్షిద్దాం అంటూ సలహా సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఫారెస్ట్ బీట్ అధికారులు అశోక్, వీరు సింగ్,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తొలిసమయం, ఇల్లందు. మే,11

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జేబీఎస్ పాఠశాల నందు ఈరోజు 2001- 2002 సంవత్సర 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పెద్ద మొత్తంలో విద్యార్థులు పాల్గొన్నారు.. సభ ప్రారంభానికి ముందుగా దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయులు: తోటమల్ల రమ భద్రాచలం ఎంఈఓ, ప్రసాద్ సార్ హనుమకొండ ఎంఈఓ, సిహెచ్ రాంబాబు సార్ ,రఫీ సార్, క్రిస్టఫర్ సార్ రాములు సార్లను పూల మొక్కలు ,శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి,ఘనంగా సన్మానించుకున్న పూర్వ విద్యార్థులు.. అనంతరం వారు మాట్లాడుతూ.... జేబీఎస్ పాఠశాల నందు గత మధుర స్మృతులను నెమరువేస్తూ వారి యొక్క జ్ఞాపకాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఆ రోజులలో విద్యార్థులు చదువు కోసం పాఠశాలకు వచ్చేవారని, ఈ కాలంలో చదువు వదిలేసి మిగతా అన్ని విషయాలకు పాఠశాలకు వస్తున్నారని వారు అన్నారు.ఈ పాఠశాల ఒక విశ్వవిద్యాలయం లాంటిదని, ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు సుమారు 20 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారని, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఆరుగురు స్థిరపడ్డారని, ప్రతి ఒక్కరూ అన్ని రంగాలలో స్థిరపడ్డందుకు చాలా ఆనందంగా ఉందని వారు సంతోషం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా బొజ్జ నరసింహారావు రవి నాయక్, కమలాకర్ రాజు,నరసింహారావు, వెంకటరమణ, అయూబ్, సందీప్, కమలాకర్, భద్ర, మధుకర్, శంకర్, ముత్యాల రమేష్,చందర్, గడ్డం బిక్షపతి ఉపేందర్ ఎం శ్రీకాంత్ ,మాలిక్ సతీష్, రహీం, శివ విజయ్ వెంకటమ్మ బాలరాజు జానకిరామ్ వినయ్ బొల్లం శీను గంట శీను తన్వీర్ భరత్ మహేష్ గోవర్ధన్ 2001-2002 10వ తరగతి విద్యార్థిని,విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.... ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు 23 సంవత్సరాల తర్వాతకి జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో గత స్మృతులను తలుచుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో స్థిరపడి ఒకసారి కలుసుకోవడంతో గత స్మృతులను నెమర వేసుకొని భావోద్వేగాన్ని గురయ్యారు తమకు పాఠాలు నేర్పించిన జీవితంలో ఉన్నత వ్యక్తులుగా తీర్చిన పాఠశాల ఉపాధ్యాయుల రుణం ఎప్పటికీ మర్చిపోలేని తీర్చుకోలేమని ఈ సందర్భంగా విద్యార్థులు వారి వారి మాటలలో వారు వారి భావాన్ని వ్యక్తపరిచారు

పలు వివాహ శుభకార్యాలలో పాల్గొన్న
డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్

తొలిసమయం, ఇల్లందు. మే, 11



కామేపల్లి శివారు పెద్ద లక్ష్మ తండా వాస్తవ్యులు జరపల బద్రు పద్మ ల కుమార్తె పావని. పండితాపురం గ్రామానికి చెందిన అరవ గోవిందు నాగమణిల పుత్రిక భవ్య శ్రీ. పండితాపురం గ్రామానికి చెందిన చల్లా వీరన్న కుమార్తె నవ్య. ఖమ్మం పట్టణ వాస్తవ్యులు కోడి లింగయ్య సుభద్ర ల కుమారుడు సందీప్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జగ్గారం గ్రామస్థులు భారీ ఉప్పలయ్య ఉమాల కుమార్తె అనూష ల వివాహ కార్యక్రమాల్లో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని అక్షింతలు వేసి, సాంప్రదాయాలు కనుగుణంగా పెద్దల ఎదుట ఒక్కరైన మీరు అన్యోన్య దాంపత్యంతో పది కాలాలపాటు చల్లగా ఉండాలని ఆశీర్వదిం చారు. ఈ కార్యక్ర మంలో అజ్మీర రాందాస్. సుమన్. బొమ్మగాని పిచ్చయ్య. పల్లె ఉపేందర్ రావ్. చింతల వెంకటేశ్వర్లు. అరవ లాల్ కృష్ణ బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన
పాలకుర్తి కాంగ్రెస్ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి

తొలి సమయం పాలకుర్తి మే 11

జనగాం జిల్లా కేంద్రంలో ఉన్న భ్రమరాంబ ఫంక్షన్ హాల్ లో మరియు కొలుకొండ గ్రామంలో జరిగిన వివహమహోత్సవా వేడుకకు హాజరై నూతన వదువరులను ఆశీర్వదించిన పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి వివహమహోత్సవా వేడుకలో హాజరై నూతన వదువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ఝాన్సి రెడ్డి వెంట..మండల పార్టీ సీనియర్ నాయకులు, యూవజన నాయకులు, మహిళ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, తదితరులు, ఉన్నారు.

పలు వివాహా వేడుకలలో పాల్గొన్న
పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి

తొలి సమయం పాలకుర్తి మే 11

పాలకుర్తి మండల కేంద్రంలో రెడ్డి గార్డెన్లో జరిగిన వివాహ మహోత్సవ వేడుకల్లో స్థానిక నాయకులతో కలిసి నూతన వదువరులను ఆశీర్వదించిన ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మండలంలోని బొమ్మేర గ్రామంలో జరుగుతున్న వివాహమహోత్సవ వేడుకల్లో పాల్గొని నూతన వదువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి పాలకుర్తి మండలం బాషరత్ ఫంక్షన్ హల్లో జరిగిన వివహమహోత్సవా వేడుకలో హాజరై నూతన వదువరులను ఆశీర్వదించిన పాలకుర్తి ఇంచార్జ్ శ్రీమతి ఝాన్సి రాజేందర్ రెడ్డి పాలకుర్తి మండలం కేంద్రంలో ని మాంగళ్య ఫంక్షన్ హాల్ లో జరిగిన వేడుకలో స్థానిక నాయకులతో కలిసి హాజరై నూతన వదువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ఝాన్సి రెడ్డి ఝాన్సి రెడ్డి వెంట.బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, పట్టణ అధ్యక్షులు కమ్మగాని నాగన్నా, మాజీ సర్పంచ్ యకంత రావు, ప్రధాన కార్యదర్శి భార్గవ్, నియోజకవర్గ యువజన అధ్యక్షులు రాజేష్ నాయక్, మండల యువజన అధ్యక్షులు హరీష్, మెడరపు సుధాకర్, రమేష్, భాస్కర్, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు, ఉన్నారు

బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన
మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొలి సమయం తొర్రూరు మే 11

తొర్రూరు మండలంలోని కంటాయ పాలెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు మాజీ ఎంపీటీసీ పల్లె దేవమ్మ పెద్ద కుమారుడు పల్లె యాకన్న గీత కార్మికుడు ఇటీవల ప్రమాదవశాత్తు తాడిచెట్టు పై నుండి పడి నిన్న చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణిం చగా విషయం తెలుసుకుని ఎంజీఎం నందు వారి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

పులి కృష్ణయ్య భౌతిక కాయానికి పూలమాలవేసి
నివాళులర్పించిన మాజీ మంత్రి డి ఎస్ రెడ్యా నాయక్

తొలి సమయం దంతాలపల్లి మే 11

దంతాలపల్లి మండలం రామాంజ పురం గ్రామంలో పులి కృష్ణయ్య భౌతిక కాయానికి మాజీ మంత్రి డిఎస్ రెడ్యా నాయక్ పూలమాలవేసి నివాళులు అర్పించాడు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశాడు.ఈకార్యక్రమంలో ఆయన వెంట ఓలాద్రి మల్లారెడ్డి వీరబోయిన కిషోర్ ధర్మారపు నాగయ్య మల్లం లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

మావోయిస్టులతో చర్చలు జరపాలి

మే13న ఇల్లందులో జరుగు ప్రదర్శనను జయప్రదం చేయండి. అఖిలపక్షం పిలుపు

తొలిసమయం, ఇల్లందు. మే, 11.

చత్తీస్గఢ్లో ఆపరేషన్ కగార్ ను కేంద్ర ప్రభుత్వం ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సిపిఐ (ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఆవునూరి మధు,కాంగ్రెస్ పట్టణ నాయకులు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుదర్శన్ కోరి,సిపిఐ జిల్లా నాయకులు దేవరకొండ శంకర్,సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఏ నబి,టిడిపి పట్టణ అధ్యక్షులు ముద్రగడ వంశీ,తుడుందెబ్బ జాతీయ నాయకులు రమణాల లక్ష్మయ్య,ఆల్ ఇండియా ట్రైబల్ ఫారం రాష్ట్ర కన్వీనర్ సూర్ణపాక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ ను వ్యతిరేకిస్తూ ఆదివారం ఇల్లెందులో సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అఖిలపక్షాలు,ఆదివాసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. చత్తీస్గడ్ లో5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను ఆదానీ, అంబానీలకు,కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టేందుకు రాజ్యాంగ విరుద్ధంగా ఆదివాసి చట్టాలను ఉల్లంఘించి బలవంతంగా ఆదివాసీలను ఖాళీ చేయించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను, మావోయిస్టులను హత్య చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కర్రెగుట్టలో కాల్పులను విరమించాలని,సైన్యాన్ని వెనక్కు రప్పించాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. మే13న ఇల్లెందులో అఖిల పక్షాలు,ఆదివాసి సంఘాలు నిర్వహించే ప్రదర్శనకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యూడెమోక్రసీ నాయకులు కొక్కు సారంగపాణి,డి. ప్రసాద్,కల్తీ వెంకటేశ్వర్లు,పూనెం రంగయ్య,ఎట్టి నరసింహారావు,రావూరి ఉపేందర్ రావు,మేకల వినోద్,ఏఐటిఎఫ్ జిల్లా కన్వీనర్ మోకాళ్ళ రమేష్, సిపిఐ పట్టణకార్యదర్శి బంధం నాగయ్య,సిపిఎం మండల నాయకులు తాళ్లూరి కృష్ణ,మన్యం మోహన్ రావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు దుగ్గారపు వీరభద్రం,జిల్లా కార్యదర్శి సనప రామారావు,జిల్లా నాయకులు వట్టం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బిడ్డలకు జన్మనిచ్చి భరతమాతను కాపాడే

ఓ తల్లి నీకు ఇదే మా వందనాలు

ఉన్నందాస్ గడ్డలో ఘనంగా మాతృ దినోత్సవం

తొలిసమయం, ఇల్లందు. మే,11.

కొత్తగూడెం, బిడ్డలకు జన్మనిచ్చి భరతమాత ఒడిలో ఉన్న బిడ్డలను పహల్గామ ఉగ్ర దాడిలో శత్రుదేశం నుండి కాపాడేందుకు వీరులను పంపిన ప్రతి తల్లికి ఇదే మా పాదాంజలి. ఆపరేషన్ సింధూర్ బాధ్యతలో ఉన్న వీరవనితలు మహిళా కమాండర్ సోఫియా కురేషి, వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ భరతమాత సింధూరం మహాశక్తిని చూపించిన మీకు ఇవే మా వందనాలు అంటూ ఉన్నదాసు గడ్డలో మాజీ కౌన్సిలర్లు మునిగడప పద్మ వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి లేనిదే మనకు జన్మ లేదని ఆ తల్లి నవ మాసాలు మోసి ఎన్నో బాధలకు ఓర్చుకొని జన్మనిచ్చిన బిడ్డలను మంచి బాటలో నడిపించాలని వారి ఎదుగుదలే తన సంతోషమని జీవిస్తుందని వారు అన్నారు . ఆ తల్లికి మనం ఎంతో రుణపడి ఉండాలని నేటి ఆధునిక సమాజంలో తల్లిదండ్రులను చూడనటువంటి కొంత దుర్మార్గ వ్యవస్థ ఉన్నదని అలాంటి వ్యవస్థను ఈ మదర్స్ డే నుండైనా మార్చాలని అన్నారు. తల్లులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి పౌరుల్లో ఉంటుందని ఈ సందర్భంగా వారు అన్నారు. భరతమాతను కాపాడే పదో వార్డుకు చెందిన తెలగరి అభిలాష్, బానోత్ గౌతమ్ బిడ్డలను కన్న తెలగరి మాణిక్యమని, బానోతు సుశీల తల్లులు మన ఇండియన్ ఆర్మీకి అందించి నేటి యుద్ధంలో భాగస్వాములను చేసిన వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే ఉన్నందాస్ గడ్డ వృద్ధాప్య తల్లులను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి అందరికీ మాతృ దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి సూరి మేని జనార్ధన్ ,ఎస్కే జలీల్, బానోతు చందర్, సిపిఐ సీనియర్ నాయకులు కట్ట సత్యనారాయణ, అస్మత్ పాషా, షణ్ముఖ చారి ,రమేష్, మునిగడప స్వరాజ్యం, ముద్దం మార్తమ్మ, బానోతు కమల, సత్యవతి, తెలగరి సౌజన్య ,పద్మక్క, శ్రీదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ పనులు పూర్తయ్యేదెప్పుడు ఎంపి రామ సహాయం రఘురాంరెడ్డి

- కొత్తగూడెం రైల్వే స్టేషన్ పనులు పరిశీలించిన ఎంపి

- పనుల జాప్యంపై ఆగ్రహం - త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు

తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 11

కొత్తగూడెం రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేయడంలో జరుగుతున్న ఆలస్యంపై ఖమ్మం ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనుకున్న సమయంలో పనులు జరగకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, గుత్తేదారు కు ఫోన్ చేసి పనులు ఎంత వరకు పూర్తయ్యాయని, ఎందుకు పనులు ఆలస్యంగా నడుస్తున్నాయని ప్రశ్నించిన ఎంపి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్ పరిధిలో జరుగుతున్న పనుల పరిశీలించిన ఎంపి రఘు రాంరెడ్డి వీలైనంత త్వరలోనే పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎంపి వెంట మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, ఊకంటి గోపాల్ రావు,



మాజీ ఏఎంసి చైర్మన్ రాంబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధముగా ఇసుక ర్యాంప్ అనుమతులు

- తక్షణమే అనుమతులు రద్దు చేయాలి - గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ

తొలి సమయం చర్ల, మే 11

చర్ల మండలం లో ఆదివారం జిఎస్పి ముఖ్య కార్యకర్తల సమావేశం ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ అధ్యక్షతన జరిగినది.ఈ సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ సుబ్బంపేట పంచాయతీ పరిధిలోగల రెవెన్యూ గ్రామాలు కానీ బిఎస్ రామయ్య నగర్ ,గొల్లగూడెం, క్రాంతి పురం గ్రామాలకు నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ బౌండరీస్ లేనప్పటికీ ఇల్లీగల్ గా రెవిన్యూ అధికారులు ఏరకంగా ఇసుక ర్యాంపుకు అనుమతులు ఎలా ఇచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో పీసా చట్టాన్ని తుంగలో తొక్కి ఇసుక బడా కాంట్రాక్టర్లకు పైరవీలతో సీఎండీసీ) ఇరిగేషన్ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారో బహిర్గతం చేయాలని అన్నారు .కొయ్యూరు పంచాయతీ పరిధిలో రెవెన్యూ గ్రామాలు ఉన్నప్పటికీ రామంజపురం, రేగుంట ఆ గ్రామాలకు అనుమతులు ఇవ్వకుండా. రెవెన్యూ లేని గ్రామాలకు లాబింగ్ తోటి అనుమతులు తీసుకొచ్చి. నూతన పంచాయతీ రాజ్ పంచాయత్ చట్టాన్ని వాల్టా చట్టాన్ని ఇరిగేషన్ చట్టాన్ని రెవెన్యూ చట్టాన్ని ఉల్లంఘన చేస్తూ చట్ట విరుద్ధంగా సహజ ఆదివాసి వనరులను దోచుకోవడానికి ఈ రకంగా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.తక్షణమే ఆ ఇసుక ర్యాంప్ అనుమతులను రద్దు చేయటానికి జిల్లా అధికారులు స్పందించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో (జీఎస్ పి) వర్కింగ్ ప్రెసిడెంట్ పునేం.వరప్రసాద్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర నాయకులు ఇర్పా.ప్రకాష్ పర్శిక. అనిల్ కారం. ప్రశాంత్ పాల్గొన్నారు.

రైతులు ఎలాంటి ఆందోళన

చెందాల్సిన అవసరం లేదు

- తహశీల్దార్ రమాదేవి

- ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

తొలిసమయం కొత్తగూడ మే 11

రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహశీల్దార్ రమాదేవి అన్నారు.మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసరం ఆదివారం కొత్తగూడ మండలంలోని ఉన్నటువంటి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెవిన్యూ శాఖ సిబ్బంది తో తనిఖీ చేసి ఈ సందర్భంగా తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు వెంట వెంటనే తరలిస్తూ ఎప్పటికప్పుడు రైతులు, హమాలీలు, సంబంధితనీ సమన్వయ పరుస్తూ వేగంగా ధాన్యం రవాణా చేస్తునమాని అవసరం ఉన్నచోట లారీలను సిద్ధంగా ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కాంటావేసి తరలించడం జరుగుతుందనీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తగినన్ని గన్ని సంచులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కొనుగోలు కేంద్రాన్ని నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ కార్యక్రమం లో రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన

డోర్నకల్ శాసనసభ్యుడు డాక్టర్

రామచంద్రనాయక్



తొలి సమయం దంతాలపల్లి మే 11

దంతాలపల్లి మండల కేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాల్ లో రేపోనీ గ్రామానికి చెందిన సాదు ప్రభాకర్ రెడ్డి కుమారుడు వివాహ వేడుక జరిగినది. ఈ వేడుకకు డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్ర నాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాడు. ఈ కార్యక్రమా నికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్ కొమ్మినేని రవీందర్ బాలాజీ కొమ్మినేని సతీష్ మద్దుల రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం భారజల కేంద్రంలో

పోలీసుల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

తొలిసమయం, ఇల్లందు. మే,11

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం పిఎస్. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో అశ్వాపురం నందు గల హెవీ వాటర్ ప్లాంట్ నందు మాకు డ్రిల్ ను నిర్వహించడం జరిగింది.నిన్న అనగా 10.05.2025 శనివారం నాడు హెవీ వాటర్ ప్లాంట్ నందు ఈ మాక్ డ్రిల్ ను నిర్వహించడం జరిగింది.ఏదైనా అత్యవసర సమయంలో మరియు ఆకస్మిక దాడి జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సందర్భానుసారంగా రక్షణ కొరకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి తెలియపరుస్తూ ఈ మాక్ డ్రిల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని డిఎస్పీ రవీందర్ రెడ్డి వెల్లడించారు.భారజల కేంద్రంలో ఉద్యోగులు పనిచేసే చోట మరియు కాలనీలో నివసించే వారి కుటుంబాలు అత్యవసర సమయంలో అలారం సిస్టంను వినియోగించి నప్పుడు పాటించవలసిన నియమ నిబంధనల గురించి వివరించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ కమాండెంట్ అమిత్ కుమార్ గారు, ఎస్డిపిఓ మణుగూరు శ్రీ రవీంద్ర రెడ్డి గారు, అశ్వాపురం సిఐ జి అశోక్, ఎస్ఐ మధు ప్రసాద్ మరియు సిఐఎస్ఎఫ్ సిబ్బంది అశ్వాపురం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాలను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

న్యూఢిల్లీ : సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం.అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పారు ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తో పాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 2014లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి.

అప్పులతో ఎంతకాలమీ పాలన !

న్యూఢిల్లీ : ఉచిత పథకాలతో ఆర్థిక పరిస్థితి ఎలా దెబ్బతిందో చూస్తున్న మనం..ఇంకా అలాంటి వాటి కోసం కక్కుర్తి పడుతున్న రాజకీయనేతల కారణంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఇకపోతే ప్రతిదానికి కేంద్రాన్ని దేబురించే పరిస్థితి పోవాలి. ఆదాయం ఉన్నమేరకు ప్రణాళికలు ఉండాలి. అప్పులు చేసి, ఉచిత పథకాలను కొనసాగించే దౌర్భాగ్యం సరికాదు. సొంతంగా రాష్ట్రాలను అభివృద్ధి చేసి, ఆదాయాలను సంపాదించి పెట్టేలా చేయాలి. ఉమ్మడి ఎపి నుంచి విడివడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పుడు ఆర్థికంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజల సమస్యలు తీరలేదు. అయినా పాలకుల్లో మార్పు కానరావడం లేదు. ఉచిత పథకాలు వద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. కిలో రూపాయికే సన్నబియ్యం గురించి తెలంగాణ కాంగ్రెస్ పాలకులు గొప్పలు చెబుతున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నాటి సిఎం ఎన్టీఆర్ ప్రవేశ కిలో రెండురూపాయల బియ్యం పథకాన్ని ఓటుబ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించు కుంటున్నారు. దీంట్లో జరుగుతున్న దుబారా పట్టించుకోవడం లేదు. అభివృద్ధిచేయడం ద్వారా సంపద సృష్టించి ప్రజలను స్వయం సమృద్ధిగా బతికేలా చేయాల్సిన నేతలు ప్రభుత్వ ఖాజానాను కొల్లగొట్టి దోచిపెడుతున్నారు. డబ్బుల పందేరం వల్ల అభివృద్ధి ఆగిపోయి..రాష్ట్రం దివాళా తీస్తున్నా పట్టించుకోని నేతల కారణంగా అన్ని రంగాల్లో వైఫల్యాలను చూస్తున్నాం. ప్రజలకు మేలు చేసే పనులు చేసి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలవాల్సిన నేతలు పథకాల పేరుతో ప్రజలను ఓటు బ్యాంకుగా తయారు చేసుకుంటున్నారు. ఈ పందేరం అభివృద్ధి పనులపై ఖర్చు పెట్టి ఉంటే ఆయా రంగాలు పురోగమించేవి. కనీస మౌళిక వసతులు సాగు, తాగునీరు. రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లు, ఆస్పత్రులపై ఖర్చు పెట్టడం లేదు. వీటికి కేటాయింపులు కూడా తక్కువే. కేవలం పెన్షన్లు, ఉచితబియ్యం ఇవే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా అమలవుతున్నాయి. జగన్ హయాంలో బటన్ నొక్కుడుతో రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారు. విశాఖలో ఆకాశ హర్మ్యాల లాంటి భవంతులను కట్టుకున్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు డబ్బులు వృధా చేశారు. అప్పనంగా డబ్బులు వెనకేసుకున్నారని ఆరోపిస్తున్న ప్రస్తుత పాలకులు వీటిపై నిజాయితీగా విచారణ జరిపించి, శిక్ష పడేలా చేయలేక పోతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి చేసివుంటే కనీసం నిరుద్యోగం తీరేది. ఉత్పాదక రంగం అభివృద్ధి చెందేది. తన ఓటు బ్యాంకు కోసం పాలకులు రాష్ట్రాలను అప్పుల కుప్పగా చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. ఎన్ని కుటుంబాలకు నగగదు బదిలీ చేశామన్నది కాదు. ఎంతగా అభివృద్ధి సాధించామన్న లెక్కలు తీయాలి. ఇకపోతే పరిశ్రమలకు ప్రాణాధానం విద్యుత్. వేసవి వచ్చే వరకు ఎంత వినియోగం ఉంటుందో లెక్కలు వేయలేక పోతున్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవడం లేదా..ఉత్పత్తి ఉన్న ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం లాంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం అసమర్థతకు నిదర్శనం. నిజానికి విద్యుత్ ఉంటేనే అడుగు ముందుకు పడే రోజుల్లో ఉత్పత్తిపై వ్యూహం లేకపోవడం దారుణం. కరెంట్‌పై ఖర్చు అన్నది ఉత్పత్తికి, ఉపాధికి బాట వేస్తుందని గుర్తించడం లేదు. కేంద్రంలోని మోడీ కూడా దీనిని పట్టించు కోవడం లేదు. ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలతో కరెంట్ బిల్లులు ప్రజలకు వాతలు పెడుతున్నాయి. భారీగా పెరిగిన చార్జ్జీలతో గృహ వినియోగదారులకు షాక్ తగులుతోంది. ఇకపోతే బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు.

పచ్చని పల్లెలలో రాజకీయ చిచ్చు

తండ్రి కొడుకు అన్నాదమ్ములు అనే భేదం లేకుండా వారి స్వలాభం కోసం రాజకీయం



తొలి సమయం డెస్క్ హైదరాబాద్,

పల్లెటూరు అంటేనే ప్రకృతి సోయగాలు, అందమైన జీవితం, ఆనంధదాయక జీవనం, పరస్పరం సహకారం, స్నేహబంధాలకు నిలయం. గడిచిన తరాల పల్లె ప్రజలు భేదాభిప్రాయాల కంటే బంధాలు, బంధుత్వాలకు ఎక్కువ విలువిచ్చేవారు. కానీ, రాను రాను కొన్ని పల్లెల్లో రాజకీయ పార్టీల జోక్యం ఎక్కువైంది కొందరు నేతలు తమ స్వార్థం కోసం పల్లె ప్రజలను కులాలుగా, వర్గాలుగా విడగొడుతున్నారు. వారిలో వారికే చిచ్చుపెట్టి పగలు, ప్రతీకారాలతో కొట్టుకుచచ్చేలా చేస్తున్నారు. తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కుంటువడేలా చేస్తున్నారు. పల్లె గడ్డపై రాజకీయ చిచ్చు నెమ్మదిగా వ్యాపించి, ఐక్యతను చీల్చే విషంలా మారి కల్మష్టమెరుగని మనుషుల మధ్య విద్వేషాన్ని పెంచుతున్నది. ప్రతి ఎన్నికలతో పాటే పల్లెల్లో విభేదాలు, పగలు, ప్రతీకారాలు పెరుగుతున్నాయి. వర్గాలుగా విడిపోయిన ప్రజలు చిన్నచిన్న విషయాలపైనా గొడవ పడుతున్నారు. చివరికి ప్రాణాలు తీయటానికి కూడా వెనకాడని వరిస్థితికి వచ్చారు. ఒకే ఊరిలో రెండు వర్గాలు, రెండు ధ్వజాలు ఒకే ఉత్సవానికి వేర్వేరు వేదికలు ఉండటం. మిత్రులుగా ఉన్నవారు శత్రువులుగా, శత్రువులుగా ఉన్నవారు మిత్రులుగా మారడం చూస్తున్నాం. కొన్నిసార్లు బంధువులను కూడా బద్ద శత్రువులుగా మారుస్తున్నాయి. పల్లె రాజకీయాలు చాలా చోట్ల గ్రామ పంచాయతీ సమావేశాలు అభివృద్ధి చర్చల కోసం కాకుండా వరస్పర ఆరోపణలకు అడ్డాగా మారుతున్నాయి. పంచాయతీ కార్యాలయం ఎదుట జరిగే సమావేశాల్లో అభివృద్ధి ప్రణాళికల గురించి కంటే పార్టీల గొడవలు, కార్యకర్తల కొట్లాటలు, ఎవరు ఏ పార్టీకి చెందినవారనే విషయాలే ప్రధానాంశాలు అవుతున్నాయి పల్లెలో పార్టీకో పెద్ద రాజకీయ నాయకుడు, అతని కింద చిన్న నాయకులు.. వారి పంతమే నెగ్గాలనే ఆలోచనలు. వెలసి గ్రామాభివృద్ధి కుంటువడి రాజకీయ కక్షలు పెరుగుతున్నాయి. ఈ వర్గ విభేదాల కారణంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులు, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ, ముఖ్యంగా అర్హులైన వారికి చేరడం లేదు. నిత్యావనర నదుపాయాలు. ఉపాధి అవకాశాలు కొందరికే పరిమితమవుతున్నాయి. పదకాలు అర్హులైన, అవసరమైన వారి దరి చేరకుండా ఈ వర్గ రాజకీయాలు అడ్డుకుంటున్నాయి. చాలామంది వృద్ధులు, మహిళలు, పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఒకప్పుడు గ్రామాభివృద్ధి కోసం కలలు కన్న యువత రాజకీయ అసహనంతో అట్టుడుకుతున్నారు. వారి హృదయాల్లో నూతన ఆశలు మొలకెత్తాల్సిన సమయంలో నిరాశ, నిస్పృహలు అలుముకుంటున్నాయి. ఊరంతా కలిసికట్టుగా ఎదగాలనే కలలు.. 'మా వర్గమే గెలవాలనే కుటిల కాంక్షలో కనుమరుగైపోతున్నాయి. ఒక పార్టీ గెలిచి మరో పార్టీ ఓడినప్పుడు గ్రామం గెలవదు. గ్రామం గెలవడం అంటే ప్రతి ఇంట్లో వెలుగు నిండటం.. ప్రతి కుటుంబంలో సంపద పెరగడం.. గ్రామంలో పిల్లలకు మెరుగైన విద్య వైద్య సేవలు అందడం.. వృద్ధులకు గౌరవం లభించడం.. ప్రభుత్వ పథకాలు బలహీనవర్గాలకు అందడం ఒక్కమాటలో చెప్పాలంటే గెలుపంటే సామూహిక అభివృద్ధి. రాజకీయాలు చేయడం, పార్టీలకు మద్దతుగా నిలవడం తప్పు కాదు. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారానే తన భవిష్యత్తును నిర్ణయించే నాయకున్ని ఎన్నుకునే హక్కు ఓటరుకు ఉంది. కానీ, అది గ్రామస్థాయిలో వ్యక్తిగత పగ, ప్రతీకారాలకు సాధనంగా మారడం మాత్రం సరైనది కాదు. అందుకే పల్లె ప్రజలు విచక్షణతో మెలగాలి. పెద్ద పెద్ద నాయకులంతా బాగానే ఉంటారు. కానీ, గ్రామాల్లో సామాన్య కార్యకర్తలు మాత్రం కక్షలతో జీవిస్తుంటారు. ఇలా పగప్రతీకారాలు పెంచుకుంటూపోతే మనుషులు మాత్రమే కాదు, పల్లె కూడా నాశనమవుతుంది, వర్గ, కుల బలహీనతల్ని వదిలి. గ్రామాన్ని బతికించుకోవాలి. అభివృద్ధి పథంలో నడిపించుకోవాలి వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాక, గ్రామ సమష్టి శ్రేయస్సు కోసం రాజకీయాలు చేయాలి. తాత్కాలికమైన వాటి కోసం బంధాలను, స్నేహాలను దూరం చేసుకోవడం సరికాదు. రాజకీయం ఎప్పుడూ అభివృద్ధి కోసం ఉండాలి. అంతేతప్ప వినాశనానికి కాదు, రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఈ రాజకీయ కక్షలను పక్కనపెట్టి, పల్లెలో సౌభ్రాతృత్వాన్ని, సహకారాన్ని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన పల్లెను మళ్లీ పచ్చగా, సస్యశ్యామలంగా మార్చాలి. అభివృద్ధి మార్గంలో అందరూ కలిసికట్టుగా సాగడమే ప్రజాస్వామ్యానికి నిజమైన విజయం.

కుట్రదారులను పట్టుకోవాల్సిందే !

న్యూఢిల్లీ : 2008 ముంబయి దాడుల కుట్రల వెనక ఎవరెవరు ఉన్నారన్నది బయటకు రావాల్సి ఉంది. ఈ కేసులో పాకిస్థాన్ ప్రమేం ఉన్నట్లు భారత్ గట్టి ఆధారాలు సేకరించినా పాక్ తోసిపుచ్చింది. అయితే ప్రపంచం ముందు పాక్‌ను దోషిగా నిలబెట్టడంలో భారత్ విజయం సాధించింది. కసబ్ తదితరులను ఉరితీసాక కూడా పాక్ ఉగ్రవాదాన్ని ఎప్పటికప్పుడు ప్రపంచ వేదికలపై భారత్ ఎండగడుతూనే ఉంది. ఇదే క్రమంలో పాక్‌కు కూడా గట్టిగా బుద్ధి చెప్పేలా చర్యలు తీసుకునేందుకు వెనకాడడం లేదు. గతంలో పాలకులు పాక్ పట్ల నిర్లిప్తంగా వ్యవహరించారు. ఎన్నిమార్లు అవకాశాలు వచ్చినా వదిలేశారు. అవే ఇప్పుడు మనకు శాపంగా మారాయి. పాక్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ విముక్తి తదితర సందర్భాల్లో పాక్‌ను తుదముట్టించివుంటే ఇవాళ ఈ దుర్గతి పట్టేది కాదు. తాజాగా ఇప్పుడు తహవ్వుర్ రాణాను రప్పించడంలో భారత్ కృషి మరువలేనిది. ఇదే సందర్భంలో రాణా నుంచి వివరాలు సేకరిస్తే..ముంబై దాడుల వెనక ఉన్న పెద్ద తలకాయల పేర్లు బయటపడగలవు. అయితే రాణా అంత సులువుగా బయటపడతాడని అనుకోవడానికి లేదు. ఇకపోతే భారత్ పట్ల నరనరాన వ్యతిరేకతను నింపుకున్న రాణా ముంబై దాడుల కోసం ఎంతగా తెగించాడన్నది ప్రపంచ దేశాలతో పాటు పాక్‌కు కూడా అర్థం అయివుంటుంది. ముంబై దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు స్కూల్ ఫ్రెండ్స్ మాస్టర్ మైండ్స్‌గా వ్యవహరించారు. 166 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకొన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగుల్ని వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లోనే ఇప్పటికీ ఉన్నాడు. వారిద్దరే తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళ్లు. వీరిని గుర్తించి ఇరికించడం లో ఎన్ఐఎ తీవ్రంగా కృషి చేసింది. వీరిద్దరూ పాక్‌లోని హసన్‌అబ్దుల్‌లోని సైనిక అకాడమీ అయిన క్యాడెట్ కాలేజ్ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు కావడం, తరవాత ఉగ్రవాదులు గా మారడం గమనించాలి. ఇక్కడ బోర్డింగ్ స్కూల్, కాలేజ్ నిర్వహిస్తున్నందున వీరిద్దరూ ఇక్కడ చేరారు. తరవాత మిత్రులుగా మారారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వీటిలోకి ఎంపిక చేస్తారు. డేవిడ్ హెడ్లీ పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ అయిన దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి పుట్టాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. ఇక తహవ్వుర్ రాణా 1961లో ఓ హైస్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహెచ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ-రాణా మిత్రులుగా మారారు. అక్కడి నుంచే వారి ఉగ్రరచనలకు బీజం పడిందని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో హెడ్లీ తల్లితో కలిసి అమెరికా లోని ఫిలడెల్ఫియాకు వెళ్లిపోయాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయించేవాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు- అమెరికాలోని సీఐఏకు ఇన్ఫర్మేషన్ చేరవేసేవాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలేసి.. భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరెంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోను తెరిచాడు. ఈ కంపెనీ ముసుగులోనే అతడు ముంబయి దాడులకు కుట్రను అమలు చేశాడని బహిర్గతం అయ్యింది. 2006 నుంచి ముంబయి దాడులకు కుట్ర రచన మొదలైంది. ఇవన్నీ కూడా ఎన్ఐఎ సేకరించగలిగింది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబయిని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐకు పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబయిలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడని ఎన్ఐఎ పసిగట్టింది. దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజుల పాటు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు. డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో తన ఎనిమిది రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. ఇందుకోసం 231 ఫోన్‌కాల్స్ చేశాడని ఎన్ఐఎ గుర్తించింది. అతడు చేసిన సాయానికి ప్రతిగా..పాక్ ఐఎస్ఐ అధికారులతో మాట్లాడి ఓ డీల్ కుదిర్చాడు. రాణా పాకిస్థాన్‌ను సందర్శించడానికి వీలుగా అతడికి మేజర్ ఇక్బాల్‌ను పరిచయం చేశాడు. దీంతో ఆ మేజర్ రాణాతో మాట్లాడినట్లు తేలింది. భారత్‌లో ఉన్నప్పుడు నేరుగా పాక్‌కు కాల్స్ చేయొద్దని హెడ్లీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ముంబయి దాడుల తర్వాత కూడా హెడ్లీ-రాణా టచ్‌లో ఉన్నారు. ఇక విజయ వంతంగా ముంబయిలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందిం చాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. భారతీయులకు అలా జరగాల్సిందేనని కూడా వ్యాఖ్యానించాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101